నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం, 4 జూలై, 2025

## సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**ఎమ్మెల్సీ సత్యం పిలుపు**



**కుత్బుల్లాపూర్, జులై 3 (నినాదం న్యూస్) :** సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను ఆగష్టు 19నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని మండలాల నుండి ఎంపిక చేసిన 1000మంది ప్రతినిధులు పాల్గొంటున్నందున రాష్ట్ర మహాసభల విజయవంతం కొరకు ప్రతి ఒక్కరు సహకరించాలని సిపిఐ ఎమ్మెల్సీ సత్యం ఎమ్మెల్సి శంబిపూర్ రాజు ను కలిసి వివరాలను తెలిపారు.ఈ సందర్భంగా శంబిపూర్ రాజు సిపిఐ ఎమ్మెల్సీ సత్యమ్ ను శాలువాతో సత్కరించి మహాసభల విజయవంతం కోసం తన వంతుగా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం,మండల కార్యదర్శి స్వామి పాలాభిందల శ్రీనివాస్,సిపిఐ నాయకులు వి.శ్రీనివాస్,హరినాథ్,నర్సింహా రెడ్డి,యాదయ్య,జంబూ మాజీ కార్పొరేట్పర్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ ఉన్నతాధికారులను కలిసిన జిల్లా ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్



**మంథని టౌన్ జూలై 03 (నినాదం న్యూస్) :** పెద్దపెల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఏసిపి మడత రమేష్ లను గురువారం పెద్దపెల్లి జిల్లా ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం సమర్పించారు. ఈ సందర్భంగా వారితో పలు సమస్యల పైన చర్చించారు. రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, ఇతర సమస్యలపై ఆయన మాట్లాడారు. దీనికి పోలీసు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినందుకు సురేష్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన బీజేపీ శ్రేణులు



**సుల్తానాబాద్, జులై 03 (నినాదం న్యూస్) :** సుల్తానాబాద్ మున్సిపల్ కమీషనర్ గా నూతనం గా బాధ్యతలు స్వీకరించిన టీ.రమేష్ ని బిజెపి శ్రేణులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తె లియజేశారు. ఈ సందర్భముగా నూతన కమీష నర్ టీ. రమేష్ తో సుల్తానాబాద్ మున్సిపాలిటీ లోనీ పలు వార్డులోని సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం ప్రజలకు కలిగే ఇ బ్బందులను వెనువెంటనే పరిష్కారం చేయాలని కోరారు .ఈ కార్యక్రమములో మున్సిపాలిటీ బి జెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు, ఓ బి సి జిల్లా కార్యదర్శి చిట్టవేని సదయ్య, ఎనగందుల సతీష్, గజభింకర్ పవన్, ప్రధాన కార్యదర్శి కందునూరి కుమార్, కార్యదర్శి వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నేత హరికుమార్ గౌడ్ అకాల మరణం బాధాకరం

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**కరీంనగర్, జులై 3 (నినాదం న్యూస్) :** బిజెపి సీనియర్ నేత తాళ్లపల్లి హరికుమార్ గౌడ్ అకాల మరణం పట్ల బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. హరికుమార్ గౌడ్ గురువారం తెల్లవారుజామున ఆకస్మిక మృతి చెందడంతో జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, తొ పాటు బిజెపి నాయకులు కార్యకర్తలు ఆయన నివాసానికి తరలివచ్చి, భౌతిక కాయానికి నివాళులర్పించారు. హరికుమార్ గౌడ్ భారతీయ జనతా పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. కరీంనగర్లో పార్టీ బలోపేతం కోసం హరికుమార్ గౌడ్ తన వంతుగా ఎంతో కృషి చేశారని హరికుమార్ గౌడ్ అకాల మరణం పట్ల బిజెపి జిల్లా పక్షాన తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నామని,వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామని చెప్పారు.

## ఎంపీడీవోను సత్కరించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు

**వెల్గటూర్, జూలై 3 (నినాదం న్యూస్) :** వెల్గటూర్ ఎంపీడీవో గా అదనపు బాధ్యతలు చేపట్టిన జక్కుల శ్రీనివాస్ ను మండల ఫీల్డ్ అసిస్టెంట్(క్షేత్ర సహాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ నూతనగా ఎంపీడీవో గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో ను మండల ఫీల్డ్ అసిస్టెంట్ లు అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ల సంఘం జిల్లా కోశాదికారి కాసం సంతోష్ ,మండల ఫీల్డ్ అసిస్టెంట్ ల సంఘం గౌరవ అధ్యక్షుడు గోళ్ళ సత్తయ్య,బాకీ రమేష్,తనుగుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఆశ్రమంలో శృతి ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

**లక్ష యాభై వేల విలువగల పేపర్ ప్లేట్స్ మిషన్ వితరణ**

**జమ్మికుంట, జులై 3 (నినాదం న్యూస్) :** జమ్మికుంటపట్టణంలోని మారుతీనగర్‌లో గల సాయి మానసిక దివ్యంగా విద్యార్థులు ప్రత్యేక పాఠశాలకు జమ్మికుంట పట్టణానికి చెందిన జడల భాస్కర్‌రావు ఐరన్ అండ్ హార్డ్వేర్ మర్చంట్ యజమాని తన సహోదరుడు జడల రవికుమార్ శ్రీ రేఖ అమెరికా వారు దివ్యంగా విద్యార్థులకు ఉపయోగపడే రూ.1,50,000 విలువగల పేపర్ ప్లేట్స్ మిషన్‌ను బహుకరించారు. అట్టి పేపర్ ప్లేట్స్ మిషన్‌ను గురువారం జడల భాస్కర్‌రావు ప్రథమ పుత్రుడు జడల సందీప్ కుమార్ శ్రీజ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ ఈ ఆశ్రమానికి రావడం మా చేతుల మీదుగా పేపర్ ప్లేట్స్ మిషన్‌ని ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అందజేస్తున్న భాస్కరరావు కుటుంబ సభ్యుల అందరికీ పేరెంట్స్ కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామనీ పాఠశాల వ్యవస్థాపకులు సూత్రపు బుచ్చి రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడల భాస్కరరావు, ఆయన సతీమణి సునీత, పేరెంట్స్ కమిటీ జాయింట్ సెక్రటరీ, మహమూద్ పాషా, పేరెంట్స్ కమిటీ కోశాధికారి శాంతాదేవి, పేరెంట్స్ కమిటీ మెంబర్ పొనగంటి మల్లయ్య, నయన కంటి దావఖాన డాక్టర్ సురేష్‌బాబు, జగదీశ్వర్ పాఠశాల సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాలలో వైద్య శిబిరాలు

**మంగపేట, జూలై 03 (నినాదం న్యూస్) :** మండలంలోని నర్సింహసాగర్, గొంది గూడెం గ్రామాలలో చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్నపాక యమున, ఎంసిఎచ్ మొబైల్ టీం డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసిఎచ్ మొబైల్ టీం డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాచి వడ పోసిన నీరు త్రాగాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పౌష్టికాహారం, శుభ్రమైన ఆహారం మాత్రమే తీసుకోవాలని ఆరోగ్య సూచనలు ఇచ్చారు.

# బాలల హక్కులు పరిరక్షించేందుకు నిబద్ధతతో కృషి చేయాలి

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి**





**వనపర్తి ప్రతినిధి, జులై 3 (నినాదం న్యూస్) :** బాలల హక్కులు పరిరక్షించేందుకు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి సూచించారు. గురువారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి.వచన్ కుమార్ సభ్యులతో కలిసి వనపర్తి జిల్లాలో పర్యటించి బాలల హక్కుల పరిరక్షణ విధివిధానాలను పరిశీలించారు. శ్రీరంగాపూర్ గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని, వనపర్తి పట్టణంలో బాల సంరక్షణ కేంద్రాన్ని, బాలికల ఉన్నత పాఠశాలను కమిషన్ సభ్యులు తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తో కలిసి లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో బాలల హక్కుల పరిరక్షణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి ఆరు సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు పౌష్టికాహారం అందించి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖపై ఉందన్నారు. పిల్లలకు ఆరోగ్య లోపాలు ఉంటే ముందుగానే గుర్తించి ఎన్ ఆర్.సి కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించి సరైన పౌష్టికాహారం, వైద్యం అందించి ఆరోగ్యవంతులుగా చేయాలన్నారు. అదేవిధంగా పిల్లలు ఏదైనా వైకల్యంతో ఉంటే ముందుగానే డి.ఎస్.టి పరీక్షలు నిర్వహించి ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ వంటి వైద్యం చేయించి ఆరు సంవత్సరాల లోపే వైకల్యాన్ని సరిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అంగన్వాడిలలో ఇచ్చే బాలామృతం పై ప్రజలకు సరైన అవగాహన లేక పిల్లలకు తినపించకుండా పశువులకు వేయడం వంటివి జరుగుతుంటాయని, అసలు బాలామృతం అనేది ఎదిగే పిల్లలకు నిజంగా అమృతం లాంటిదని, చాలా పౌష్టిక విలువలతో కూడుకున్నదని దీనిపై గ్రామ స్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలకు ఖచ్చితంగా తినిపించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నమోదు అయిన పోక్సో కేసులు, బాల్య వివాహాల కేసులు, బాల కార్మికుల కేసుల వివరాలు సంబంధిత శాఖల నుండి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పోలీస్ శాఖ బాలల హక్కుల పరిరక్షణ, వారి ఆరోగ్యంపై చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. భవిష్యత్తులో సైతం మరింత పకడ్బందీగా పని చేసి పిల్లల ఆరోగ్యంతో పాటు విద్యా, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికుల నిర్మూలన, అత్యాచారాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. అవసరమైన చోట అంగన్వాడి స్వంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, అదేవిదంగా అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆపరేషన్ ముష్కాన్, ఆపరేషన్ స్మైల్ సమన్వయంతో నిర్వహించడమే కాకుండా యజమానుల పై జరిమానాలు విధించాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగితే బాధ్యులందరి పై కేసులు చేయడమే కాకుండా పెళ్ళి ఆలోచనలు చేస్తున్నప్పుడే ముందుగానే పసిగట్టి అవగాహన కల్పించి బాల్య వివాహాలు నిరోధించాల్సిన బాధ్యత పంచాయతీ సెక్రెటరీ తీసుకోవాలని సూచించారు. చాలా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా ప్రాంగణం ఉండదని, కనీస మౌలిక వసతులు లేకుండా జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేసి తీసుకున్న చర్యలపై నివేదిక పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో వయస్సుకు తగ్గ బరువు ఎత్తు లేని పిల్లలను ఎన్.ఆర్. సి కేంద్రానికి అంగన్వాడి కార్యకర్తలు 102 వాహనం ద్వారా తీసుకువచ్చి వారం రోజులు ఉంచి వైద్యం, పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులను చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన ప్రతి అమ్మాయిని జూనియర్ కళాశాలలో చేర్పించే బాధ్యతను ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై పెట్టడం జరిగిందన్నారు.ప్రతి గ్రామంలో వి.సి. పి.సి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి నెల మొదటి సోమవారం గ్రామంలో కమిటీ సమావేశమై బాల్య వివాహాలపై అవగాహన, తగిన చర్యలు తీసుకునే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషన్ కు వివరించారు. అనాథ పిల్లలకు మెరుగైన విద్యనందించడమే కాకుండా వారికి ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరిగితే ఖచ్చితంగా కేసు బుక్ చేసి చార్జి షీట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పోక్సో కేసులో చార్జి షీట్ నమోదు చేయడమే కాకుండా బాధితులకు సకాలంలో పరిహారం ఇప్పించడం, వారికి సపోర్ట్ పర్సన్ ను నియమించి తగిన ధైర్యం, సహాయ సహకారాలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకై చేపడుతున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కమిషన్ సభ్యులు కొనియాడారు. అనంతరం జిల్లాలో ఉత్తమ మార్కులు పొందిన అనాథ పిల్లలకు మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డి.సి.పి.ఓ రాంబాబు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా కోరులనుండి.. ప్రభుత్వ భూములను కాపాడండి

**ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా భూములు కేటాయించండి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**



**అల్వాల్, జూలై 3 (నినాదం న్యూస్) :** మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని అంతాయిపల్లిలోని కలెక్టరేట్లో మర్యాద పూర్వకంగా కలిసి మల్కాజ్గిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల, ప్రభుత్వభూముల పరిరక్షణ, ప్రజా అవసరాలకు అనుగుణంగా భూముల కేటాయింపులు వంటి పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కార్పొరేటర్లు, సంబంధిత కాలనీ, బస్తీ వాసులు నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని కబ్జా కోరల నుంచి కాపాడి ప్రజా ఉపయోగపడే విధంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, లైబ్రరీలు, నవోదయ స్కూల్, కాలేజ్, సబ్ స్టేషన్లకు భూములు కేటాయించాలని, ఎన్నో ఏళ్లుగా ఉన్న యుఎల్‌సి (అర్బన్ సీలింగ్ ల్యాండ్) సమస్యలను పరిష్కరించాలని, భూధాన్ ల్యాండ్‌ను ప్రజలకు అవసరమయ్యే విధంగా ఆట స్థలం, స్టేడియంలకు ఉపయోగించాలని, అల్వాల్ జొన్న బండ ప్రాంతంలో సర్వేనెంబర్ 22 , 23లో ప్రజల కొనుక్కున్న ఫ్లాట్లను కబ్జా చేసి ప్రైవేటు వ్యక్తులు రాక్ ల్యాండ్ ఎవెన్యూ అపార్ట్మెంట్లు నిర్మిస్తున్నారని, మచ్చ బొల్లారం హిందూ స్మశాన వాటిక అన్యాక్రాంతం అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు పట్టించుకోవడంలేదని సహకరించడం లేదని కలెక్టర్ కు స్పష్టంగా చెప్పడం జరిగిందని తెలిపారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు, లైబ్రరీలకు 15 ఫైనాన్స్ కమిషన్ ప్రకారం నిధులు కేటాయించి ఉన్న ప్రభుత్వ భూములు ఇప్పటివరకు కేటాయించలేదని, కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఉదాహరణకు సర్వేనెంబర్ 844 హైదరాబాద్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల మధ్య సరిహద్దులు సూచించకపోవడంతో దాదాపు 55 ఎకరాల స్థలం కబ్జాలకు గురి అవుతున్నాయని అలాంటి స్థలంలో నవోదయ స్కూల్లో సబ్ స్టేషన్ ఏర్పాటు చేసే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఎ.డి. సర్వే చేయించాలని ఇంతవరకు మల్కాజ్గిరి నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కేటాయించలేదని, ఎక్కడ బ్లూ షీట్లు ఉంటే అక్కడ కబ్జాలకు ప్రభుత్వ స్థలం గురి అవుతుందని దాని నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాల్సి వస్తుందని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కబ్జాకోర్లకు వెన్నుదన్నుగా నిలవద్దని సూచించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి పత్రాలను అందజేస్తూ కలెక్టర్‌కి సవివరంగా వివరించారు. అందుకుగాను కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి అభివృద్ధికి తోడ్పడుతానని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, మేకల సునీత రాము యాదవ్, బిఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, డోలి రమేష్, శోభన్ బాబు, ఉస్మాన్, నేమూరి శ్రీధర్ గౌడ్, శివ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, హేమంత్ పటేల్, రమేష్, శ్రీనివాస్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, వంశీ, బాలకృష్ణ, మోసిన్, లక్ష్మణ్ యాదవ్, పవన్, ఉష, మారుతి ప్రసాద్, ప్రశాంత్ రెడ్డి, అరుణ్ కుమార్, లియోనార్డ్, వివిధ కాలనీ ,బస్తీ వాసులు, కుల సంఘాల నాయకులు, మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోపాల మిత్ర గోస పడ్తున్రు..



**నూతనకల్, జూలై 3 (నినాదం న్యూస్) :** పాడి పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తున్న గోపాల మిత్రలకు ప్రభుత్వం నుంచి 9 నెలలుగా జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు. అసలే చాలీచాలని గౌరవితనంతో నెట్టుకొస్తున్న తమకు సకాలంలో జీతలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండల కేంద్రానికి చెందిన గోపాల మిత్రలు చెప్తున్నారు.డబ్బులు లేక కుటుంబ పోషణ భారం అవుతుందని పేర్కొన్నారు. అయినా తమ దుస్థితిని ఎవరు పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

**ఇబ్బందుల్లో గోపాల మిత్రలు**

గోపాల మిత్ర పథకం 2000లో ప్రారంభమైంది.2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీరికి గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు ఆ తరువాత క్రమంగా పెంచుతూ వచ్చారు.2018 లో సీఎం కేసీఆర్ ఒకేసారి రూ.5వేలు పెంచగా, గౌరవ వేతనం రూ.8, 500కు చేరుకుంది. ప్రస్తుతం వీరికి రూ.11,050ల వేతనాలు ఇస్తున్నప్పటికీ సమయానికి అందగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**జీతాలు అందక ఇబ్బంది పడుతున్నాం**

ప్రభుత్వం చెప్పి అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని పశువులకు వైద్యం చేస్తూ రైతులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాం. అయినా మాకు తొమ్మిది నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో మా కుటుంబాలను పోషించడం ఇబ్బందిగా పడుతున్నాం. ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించాలని పలుమార్లు మంత్రులకు విన్నవించాం.గతంలో పీసీసీ అధ్యక్షుడు హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి మా విన్నపాన్ని తెలిపాం. ప్రభుత్వం రాగానే తప్పకుండా నెరవేరుస్తామని మాట ఇచ్చి ఇప్పటివరకు పట్టించుకున్న పాపాన లేదు. వెంటనే ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించి, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి. గుగులోతు లింగా నాయక్ గోపాలమిత్ర నూతనకల్ మండలం

## ఎన్నికల ముందే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**డీటీఎఫ్ అధ్యక్షుడు ఆవాల నరహరి**

**జమ్మికుంట, జులై 3 (నినాదం న్యూస్) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే పెండింగులో ఉన్న బిల్లులు అన్నింటిని మంజూరు చేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఇల్లందకుంట మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం గురువారం రోజున ఇల్లందకుంట మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల జిపిఎఫ్, సరెండర్ లీవు,టిఎస్ జిఎల్ఐ, ఉద్యోగ విరమణ పొందిన వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొదలగు పెండింగ్ బిల్లులన్నీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జమ్మికుంట జోన్ కన్వీనర్ ఎబూసి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల విద్యారంగంలో అన్ని స్థాయిల్లో ఖాళీగా ఉన్న జిల్లా విద్యాధికారులు, ఉపవిద్యాధికారులు,మండల విద్యాధికారుల పోస్టులతో పాటు ఉపాధ్యాయుల పర్యవేక్షక పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని, డైట్, బిఇడి కళాశాలలో లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సార్ల సంపత్ మాట్లాడుతూ డిఏలు, పిఆర్సీ సుదీర్ఘ కాలం పెండింగ్‌లో పెట్టడం సరికాదని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెరుగుతున్న జీవన వ్యయాలకనుగుణంగా ఎప్పటికప్పుడు డిఏలు, వేతన సవరణ ఏలాంటి జాప్యం లేకుండా ఇవ్వాలని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ వేణు మమాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులను సవరించాలని, ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్ గడువును ఆగస్టు 31 తేదీ వరకు పొడిగించాలని అన్నారు.ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమములోజిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, జోన్ కన్వీనర్ ఏబూసీ శ్రీనివాస్,డిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు సార్ల సంపత్,, ప్రధాన కార్యదర్శి సిహెచ్ వేణు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.సదానందం, జి.ప్రకాష్, సమ్మిరెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో జాతీయస్థాయి 5వ ర్యాంకు

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 03 (నినాదం న్యూస్) :** జిల్లాలోని తిర్యాణి ఆస్పిరేషనల్ బ్లాక్ అందరి సమిష్టి కృషితో జాతీయస్థాయిలో 5వ ర్యాంకు సాధించిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లాలోని తిర్యాణి ఆస్పిరేషనల్ బ్లాక్ జాతీయస్థాయిలో 5వ ర్యాంకు, దక్షిణాది రాష్ట్రాలలో మొదటి ర్యాంకు సాధించినందున తిర్యాణి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జిల్లా అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిర్యాణి ఆస్పిరేషనల్ బ్లాక్ జాతీయస్థాయిలో 5వ ర్యాంకు, దక్షిణాది రాష్ట్రాలలో మొదటి ర్యాంకు సాధించడంలో క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్ వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఆయాల కృషి ఎంతో ఉందని, అందరి సమిష్టి కృషి వలన ఈ స్థానం సాధ్యమైందని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ బ్లాక్ క్రింద వెనుకబడిన ప్రాంతమైన తిర్యాణి మండలాన్ని ఎంపిక చేయడం ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంఘాలు, మహిళల రివాల్వింగ్ ఫండ్, గర్భిణీ స్త్రీలకు పోషక ఆహారం అందించడం, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించడం, విద్యా రంగ అభివృద్ధి, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, భూదార్ కార్డుల జారీ వంటి అంశాలపై 100 శాతం అభివృద్ధి సాధించే విధంగా అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు దృష్టి సారించాలన్నారు. అనంతరం జాతీయస్థాయి ర్యాంకు సాధించడంలో కృషిచేసిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్లేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

**హుజూర్ నగర్, గరిడేపల్లి జూలై 03 (నినాదం న్యూస్) :** ప్రతి ఒక్కరూ జన్ ధన్ ఎకౌంట్ తీసుకోవాలని రాయిని గూడెం బ్రాంచి బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని రేగుల గడ్డ గ్రామంలో హుజూర్ నగర్ కౌన్సిలర్ పల్లి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో జన సురక్ష ప్రోగ్రాంలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మేనేజర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జన్ ధన్ ఖాతాలు తీసుకోవాలని, అదే విధంగా ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి , అటల్ పెన్షన్ యోజన లాంటి ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని ఏదైనా ప్రమాదం జరిగితే వీటితో వచ్చే ప్రమాద భీమా తో కుటుంబ సభ్యులకు ఆర్థికంగా మంచిగా ఉండొచ్చని అన్నారు. అంతే కాకుండా ఆడ పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రధాన మంత్రి సుకన్య సమృద్ధి యోజన పథకం కొరకు కనీసం నెలకు 1000 రూపాయలు కట్టినట్లయితే ఆయా డబ్బు తన పై చదువులకు, వివాహ ఖర్చులకు సైతం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సాయి బాబా, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## 9న సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం కావాలి

**భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటియు) టౌన్ అధ్యక్షుడు జంజనం కోటేశ్వర్‌రావు**

**హుజూర్ నగర్, గరిడేపల్లి జూలై 3 (నినాదం న్యూస్) :** జులై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కు సన్నద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటియు) గరిడేపల్లి టౌన్ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని తాళ్ల మల్కాపురంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) గరిడేపల్లి టౌన్ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగినది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికులకు జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు తన్నద్ధం కావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న 4లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అంతే కాకుండా కార్మికుల కోసం తీసుకువచ్చిన 1970 చట్టంతో పాటు అంతరాష్ట్ర వలస కార్మిక చట్టం1979, భవన నిర్మాణ కార్మిక కేంద్ర చట్టం1996 అమలు చేయాలన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల కోసమే ఖర్చు చేయాలని, ప్రమాద మరణానికి 10 లక్షలు,సహజ మరణానికి ఐదు లక్షలు, పెళ్ళికానుక, ప్రసూతి కానుకలు లక్ష రూపాయలకు పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఎస్కే పాషా.నాగుల్ మీరా ఎస్ కే మీరా, లక్ష్మి, శ్రీదేవి, స్వప్న, కళ్యాణి, సరిత, సిరి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

